

# శిశిర జీవితాలు

వణికారి శ్రీలలిత

"నీకు గుడ్డి వాళ్ళంటే ఎందుకంత జాలి, ఆపేక్ష శైలా?" కుతూహలంగా ప్రశ్నించారు ఆయన. ఎదురుచూడని ప్రశ్న. అయినా నా దగ్గర సమాధానం ఉంది. కాని నిజం చెబితే భరించగల హృదయం ఆయన దగ్గర ఉందా లేదా అని!

"ముష్టి వాళ్ళంటేనే ఒక విధమయిన విసుగు, అసహ్యత కనపరిచే నువ్వు, గుడ్డివాళ్ళ విషయంలో దానికి పూర్తి వ్యతిరేకం. రైలు బయలుదేరినప్పటి నుండి ఆగిన ప్రతిస్టేషన్‌లోను, ఎవరి కోసమో పరికించే నీ కళ్ళు, గుడ్డివాడు కనపడితే జాలితో తడిసి, ఎవరో ఆప్తబంధువుని చూసినట్టు ఫీలవుతున్నావు. తన చుట్టూ ఉన్న అందర్నీ చూడలేని ఆ కబోది కళ్ళకు, వాళ్ళని చూసి ఆర్ద్రతను, దయను పొంగించే నీ హృదయానికి ఏదో సంబంధం ఉంది కదూ?" నా వైపు పరికించి చూస్తూ ప్రశ్నించారు.

గుండె ఝల్లుమంది నన్ను, నా భావాల్ని పుస్తకం చదివినట్టు చదివేశారు ఆయన. నేను చేసే ప్రతి చర్య అంత కొట్టొచ్చినట్టు నా హృదయాన్ని బహిర్గతం చేస్తోందా? నా కథ ఆయన గుండెల్లో ఎలాంటి ఉప్పెనల్ని లేవదీస్తుందో! క్షమా గుణానికి అతీతమైంది మగవారి హృదయాగ్ని? మాసిపోయిన సంఘటనలు నన్ను వీడిపోవేం? ఏం చెయ్యాలో తెలియక నిస్సహాయంగా, బేలగా చూసాను ఆయన వైపు.

మెల్లగా నా చెయ్యి తన చేతుల్లోకి తీసుకుని, "ఫర్వాలేదు, సమాధానం ఎలాంటిదైనా భరిస్తాను. కానీ, ఏదో దాస్తున్నట్టుగా ఉన్న నీ మౌనాన్ని మాత్రం భరించలేను శైలా! ఏదో మగవాడి తృప్తికోసం ఎంతో తేలిగ్గా అబద్ధాలాడేసే ఆడదాన్ని నేను హేట్ చేస్తాను. సో, ఒక్క మాటలో చెప్పాలంటే కమ్ ఔట్ విత్ ద ట్రూత్!" అంటున్నారు.

ఎలా చెప్పను? మొదలంటూ సరిగ్గా లేకుండా అంతం అయిపోయిన కథని ఏ భాషలో చెప్పాలి? ఒక హృదయాన్ని చితాభస్మంలా మార్చిన కథను అసలెలా చెప్పాలి? గుండెలు బద్దలయ్యేలా ఏడ్వాలనిపించింది.

"ఒక్క క్షణం ..." మెల్లగా నా చెయ్యి విడిపించుకుని టాయిలెట్‌లోకి వెళ్ళాను. ఎదురుగా అద్దంలో నా ప్రతిబింబం నన్ను వెక్కిరిస్తున్నట్టు కనపడుతోంది.

"ఏం? ఆనాడు ప్రేమ! ప్రేమ! అంటూ విర్రవీగిన నువ్వు ఈనాడు దాని పేరెత్తటానికే జంకుతావేం? నీ మనిషి ఒకడు గుడ్డివాడయ్యాడని చెప్పటానికి నువ్వు వడేంత బాధ పడక్కర లేదు. ఎంతటి మొండిగుండె నీకు లేకపోతే నీ గతాన్ని తేలిగ్గా పక్కకి నెట్టేసి, మళ్ళీ వసంతంలోకి అడుగుపెట్టావు? ప్రేమనేది కేవలం ఉచ్చారణకు తేలిగ్గా ఉన్న పదం కదూ? అందుకే దాన్ని ఆనాడు అన్నిసార్లు ఉపయోగించి, అరిగిపోయిన పదం అని ఈనాడు వదిలేశావు. ప్రేమంటే నీకంత తేలిక విషయం కాబట్టి నీ జీవితాన్ని పుష్పింపచేయకుండా, నిలువునా ఎండింపచేసింది. నీకది తగిన శాస్తి!" పకపకా నవ్వుతోంది.

"కాదు! కాదు! నీ అంచనా తప్పు. ప్రేమలో దైవత్వాన్ని, ప్రేమించినవాడిలో ఆ దేముణ్ణే చూసాను. కానీ, మనిషి జీవితాన్ని విచిత్రమైన మలుపులు తిప్పి, ఆ మనిషిని తప్పు దోవలు పట్టించి, తను మాత్రం పట్టనట్టు కూర్చోవటం ఆ దేముడికి పరిపాటి. అందుకే మనిషిగా, అతి సామాన్యమైన మనిషిగా, ఆ లీలలు అర్థం చేసుకోలేని నేను, ప్రేమించినవాడిపై

## ప్రత్యవలోకనం

లోకాన్ని, అవలోకనం చేస్తే
నా కర్థమయింది, ఏమంటే ?
నాకేమాత్రం, తెలియదని,
నాకు తెలిసింది, అల్పమని,
నేను తెలుసుకోవల్సింది, అనల్పమని !

జ్ఞానం — అజ్ఞానం
కేవలం, అక్షరంతో
అంతులేని భేదం !

సుజ్ఞానం — విజ్ఞానం
ఈషణ్మాత్రం
నాకు లేదని ఖేదం !

అల్పుడనని ఆమోదం !
ఇసుమంత తెలిసినా
నాకెంతో మోదం !

అంతులేని, అంతుబట్టని,
ఈ జ్ఞాన, విజ్ఞాన జగతిలో
జిజ్ఞాసతో విద్యార్థినైన,
నేను, అణువులోని ఓ కణాన్ని మాత్రం.

— బ్రా రా పాండురంగశాస్త్రి

కషతో ఒకరికి భార్యనై, భార్యనైనందుకు తల్లిని కాలేకున్న నేను మోడువారిన గుండెతో మనుగడ సాగించే సగటు మనిషిని. నాలో జీవం పోసుకుంటున్న చిరుదీపం వెలుగుముందు, నా కథను ఆయనకు చెప్పే ధైర్యం వెలవెలాపోతోంది. అందుకే వంచకినని నువ్వు తూలనాడినా, జీవితాన్ని ఎదురు ఈదలేని పిరికిదాన్ని. అందుకే...'' ఇలా అనుకుని మెల్లగా బయటకు వచ్చాను

పుస్తకం చేతిలో పట్టుకుని ఎటో చూస్తున్న ఆయన్ని చూస్తే మంచితనం, గాంభీర్యం మూర్తీభవించిన ఈయనను మోసగించగలనా అనిపించింది. అయినా సరే నాకున్న ఈ ఒక్క ఆలంబనను కోల్పోలేను. అయినా ప్రపంచం అంటే ఏమిటి ? మోసం అనే పునాదులమీద

## శిశిర జీవితాలు

అబద్ధాలనే ఇటుకలతో, వంచన అనే పూత పూసిన నాలుగు గోడలు. అందులో బ్రతకగలుగుతున్న నేను, ఈ ఒక్క చిన్న అబద్ధానికి వెనుకాడనవసరం లేదు.


మెల్లగా వెళ్ళి ఆయన కళ్ళు మూసాను. అదిరిపడిన ఆయనను చూసి గలగలా నవ్వుతూ ఎదురుగా కూర్చుని ''ఏంటండీ, ఏదో భావకవిలాగా పోజు మీరూనూ ! మీ వాడి కలంతో జనాన్ని హత్య చేద్దామనుకుంటున్నారా ఏమిటి ?' అంటున్నానే కానీ హృదయం ఘోషిస్తోంది. ఎంత నటన ? ఎంత దగా ? అని. కానీ నేనేం చెయ్యను. పరిస్థితులు నేను సృష్టించుకున్నవి కావు, దేముడు నామీద కత్తి కట్టి సృష్టించినవి. వాటికి తల ఒగ్గుతున్నాను. నాకోసం మాత్రం కాదు, నాలో ఊపిరిపోసుకుని, నా కళ్ళలో మెదిలే నా పాపడికోసం!

ఆయన కూడా నా మాటలు విన్నట్టులేరు. ఇద్దరం ఎంత చేరువలో ఉన్నామో, మా హృదయాలు అంత దూరంలో ఉన్నాయి. అనుమానం అనే బీజం ఆయనలో ఇప్పుడే పడింది. అది వట వృక్షం అంత పెరగకముందే ఏరిపారేయాలనుకుని ''నేను స్కూల్లో ఉన్నప్పుడు 'బ్లైండ్‌వెబ్' అన్న పుస్తకం చదివాను. అందులో గుడ్డి జీవితాల శోభని, వారు అనుభవించే మానసిక వ్యథని చాలా బాగా చిత్రించాడు రచయిత. దాని ప్రభావం నామీద ఉండగానే, నా ఫ్రెండ్ లాబ్‌లో తన నిర్లక్ష్యంవల్ల కళ్ళు పోగొట్టుకుంది. ఆ సంఘటనే నా హృదయంలో ముద్రవేసుకుంది. ఎంత వద్దనుకున్నా, ఏమిటో, గుడ్డివాళ్ళను చూస్తే ఆ క్షణాన ఏదో జాలి, ఏదో బాధ! అవునూ... చల్లగాలేస్తోంది. మీరు తలకి మఫ్లర్ కట్టుకోండి, తెచ్చిస్తాను'' అంటూ లేచాను.

అరిచేతులంతా చెమట, వళ్ళంతా అదోక రకమయిన వణుకు. పెదవులు తడి ఆరిపోయాయి. అబద్ధం ఆడటం అంత కష్టమైన పనా ? అయినా అతకలేని ఆ అబద్ధంతో ఎన్నాళ్ళని ఈయన్ని నమ్మించడం ? ఏమయినాసరే, నా ఒడిలో పసిపాప బోసినవ్వులు చూసుకునేవరకైనా క్షణ క్షణం ఆత్మవంచన చేసుకుంటూ, ఆయనకు

[37 వ పేజీ చూడండి]




## భూమ్మీది ప్రాణికోటి ఏనాటిది?

లోగడ భూమ్మీది ప్రాణికోటి ఆరంభానికి కట్టిన అంచనాలు తారుమారయ్యేలా వున్నాయి— ఇటీవల వాయవ్య ఆస్ట్రేలియాలోని మారుమూల గల, ఎండుబీడు భూములలో దొరికిన అత్యల్ప జీవకణ అవశేషాలనుబట్టి చూస్తే భూమ్మీది ప్రాణికోటి, యింతవరకు అనుకుంటున్న దానికన్నా కనీసం కోటి యిరవై లక్షల ఏండ్లకు పూర్వమే పుట్టి వుంటుందనుకోవాల్సి వుంటుంది. అసలు మన భూమి వయస్సే నాలుగువందల ఏభై కోట్లు సం॥లని అంచనా వేశారు... కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం శాస్త్ర పరిశోధకులు, ఆస్ట్రేలియన్ శాస్త్రవేత్తలు కలసి కొనసాగిస్తున్న అన్వేషణలో బయటపడ్డ యీ అతి ప్రాచీన జీవావశేషాలు, ఒక "పాత పురాణి" బండ అంచుమీద పొరను 'పరమసున్నితమైన సూక్ష్మదర్శిని' ద్వారా రెండు వేల ఒక వంద రెట్లు పెద్దదాన్ని చేసి చూడగా గోచరమైనాయి. ప్రక్కనున్న గీతల బొమ్మ చూస్తే అందులో బాణం గుర్తులున్నవి — అలనాటి "బాక్టీరియా" అది సజీవంగా వున్నప్పుడు "యిట్లా వుండేవన్న" వూహతో గీసిన బొమ్మలు కనపడతాయి—

## శిశిర జీవితాలు

[28 వ పేజీ తరువాయి]

నా జీవితపుటద్దం ఒకవైపు మాత్రమే చూపిస్తూ ఉంటాను. ఒక రకమైన మొండి నిశ్చయాని కొచ్చాను నేను.

ఆయన తల వెనక్కి ఆనించి, కళ్ళు మూసుకుని కూర్చున్నారు. తలకి మఫ్లర్ చుట్టాను. కళ్ళు తెరుస్తారేమోనని కాసేపు చూసాను. ఉహూ ... లేదు. ఎంత వడలిపోయినట్టున్నారు. అలసట, వ్యధ ఆయన మొహంలో ద్యోతకం అవుతున్నాయి. "సీ వల్లనే!" ఎవరో అరచినట్టయ్యింది. నాలోని అహం ఒక్కసారి తలెత్తింది. "ఏం, నేనేం చేసానని? మనసున్న మనిషికి మనసిచ్చాను. ప్రేమించగల, ప్రేమనందించగల హృదయం ఉన్నందుకు సిగ్గుపడవలసినది ఏముంది? అయినా అంత సిగ్గుపడవలసిన పాపపంకిలమైన గత జీవితం మాత్రం కాదు నాది" బెర్తుమీద పడుకుని కళ్ళు మూసుకున్న నాకు, పరిగెడుతున్న రైలంత వేగంగానూ, నా మనసు గతం వైపు పరుగుతీసింది.

* * *

విశ్రాంతిగా గడిపే క్షణాలొచ్చేస్తున్నాయని సూర్యుడు బంగారు కాంతులీనుతున్నాడు. మా చుట్టూ ఉన్న ప్రతి ఇసుక రేణువు ఆ అందాన్ని ప్రతిబింబిస్తోంది. అదే మాట అన్నాను కార్తీక్‌తో!

"ఊఁ ... బంగారు కలలు కనే వయసులో ఉన్న వాళ్ళకి అలాగే కనపడుతుంది. అదే ఆ బఠాణీలు అమ్ముకునే కుర్రాణ్ణి చూడు, వాడికి ప్రతి ఇసుక రేణువులో తను భారంగా గడపబోయే రోజు కనపడుతుంది. ఆకలితో విలవిలలాడేటప్పుడు చూస్తే ఒకొక్క అన్నం మెతుకులాగా కనపడుతుంది. పుష్టిగా ఉన్న పుత్తడి బొమ్మ విషయం అంటావా ..." చిలిపిగా చూస్తూ ఏదో చెప్తున్నాడు.

ఉహూ ... అవేవీ వినిపించటం లేదు నాకు. ఆ కళ్ళ వెలుగు ఏ బంగారానికి ఉంది? ఆ వెలుగులో తడిసి కాంతిపుంజం లాగా వెలిగిపోయే నేను అదృష్టానికి మారు పేరునని గర్వంగా అనుకొన్నాను.

"అలాగే కాసేపు నిద్రపోతూ ఉండు. నేను అలా, అలా తిరిగొస్తాను" లేచి నిలబడి అంటున్నాడు, అటుగా వెళ్తున్న రెండు జడల్ని చూస్తూ.

ఉక్రోషం ఒక్కసారి పొదుచుకొచ్చింది నాకు. చెయ్యి పట్టుకుని ఒక్కలాగు లాగాను. ప్రక్కనే చతికిలపడుతూ దీనంగా మొహం పెట్టాడు. ఎంత ముద్దొస్తున్నాడు! అయినా సరే వదలకూడదు అనుకున్నా.

"ఆనాడు నేను దక్క ఏ సుందరాంగిని దృష్టిపథంలోనికి రానివ్వనని బాసచేసి ఈనాడు దానిని ఉల్లంఘించనున్నావా వంచకా! నా కోపాగ్ని కాస్త రుచి చూడు ..."

"శరణు తల్లీ! శరణు" చేతులు జోడిస్తూ భక్తి శ్రద్ధలతో అన్నాడు.

"ఏయ్ కార్తీక్! నేను నీకు అమ్మనా?" చెవి మెలిపెడుతూ అన్నాను.

"నాకు కాదులేవోయ్! ఫ్యూచర్‌లో జూనియర్ కార్తీక్‌కి మమ్మివా కావా? పోని కాదంటే తలవియ్యి, పంజరంలోంచి బయటపడ్డ పక్షిలాగ ఎగురుతాను హాయిగా" మాటైతే అంటున్నాడు కానీ తల నా ఒళ్ళోపెట్టి తన్మయత్వంగా కళ్ళు మూసుకున్నాడు.

ఆ స్పర్శ చాలు నా గుండె తీవ్రంగా స్పందించేందుకు. మెల్లగా అతని జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి "రాజా ..." అన్నాను గుసగుసగా.

"వాడెవడు?" గబుక్కున లేచి కూర్చుని అన్నాడు, కోపంగా చూస్తూ. బిత్తరపోయిన నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అది చూసి గట్టిగా తల వెనక్కి వాల్చి నవ్వాడు. ఇంకా తెరలు తెరలుగా నవ్వుతున్న కార్తీక్‌ని చూస్తే అప్పుడర్థం అయ్యింది తమాషాకి అన్నాడని.

నవ్వుతో ఎగిరెగిరి పడుతున్న అతని గుండెల మీద సున్నితంగా గుద్దుతూ, "ఎప్పుడూ నన్నేడిపించటమేనా, ఐ హేట్ యూ!" అన్నాను.

"నా పిచ్చి శైలా! అన్నిటికీ నెత్తిమీద కుండతో ప్రయోగాలేనా? నువ్వేగా నా రాజావి అంత తెలియని బుద్ధూయివా అని నన్ను దబాయించక. ఇలా అయితే ఈ ప్రపంచంలో ఎలా బ్రతకగలవు నువ్వు అయినా ప్రతి క్షణం నిన్ను అంటిపెట్టుకునుండే ఈ రాజా ఉంటే నీకేం భయం కదూ?" ప్రేమగా నన్ను తన కౌగిలిలో పొదువుకుంటూ అన్నాడు.

— అలాంటి వెచ్చని అనుభూతులతో ఎన్నో సాయంత్రాలు గడిపాము. నేను ఆనందపుటంచుల మీద పయనించిన రోజులవి. క్షణ క్షణం అమృతాస్వాదనలో మైమరచిన రోజులవి. అంతెందుకు ఇప్పుడు గుండెలవిసిపోయేలా కన్నీరు కార్చే కళ్ళకి అప్పుడు తడి అంటే ఏమిటోకూడా తెలియదు పొత్తిళ్ళలో పసిపాపకి కష్టం అంటే ఎంత తెలుసో నాకూ అప్పుడంతే!

ఒకరోజు కార్తీక్ వస్తూ ఐస్‌క్రీమ్ కోన్ తెచ్చాడు. ఏదో విశేషమే ఉండి ఉంటుందనుకుంటూ, అదే అడిగాను, ఐస్‌క్రీమ్ తింటూ.

"ఇంతవరకూ రాధాకృష్ణులం. ఇప్పుడు సీతారాములం అవ్వాలి" అన్నాడు.

"అంటే..." అర్థం కాలేదు నాకు.

"అంటే..." తన ఐస్‌క్రీమ్ తినేసి నాది లాక్కుంటూ చెప్తున్నాడు, "మనకి ఎడబాటు!" నా కాళ్ళు ముందుకి పడలేదు. ఆగిపోయి "ఏమిటి కార్తీక్ నువ్వనేది?" నా కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి అప్పుడే!

''ఏంలేదోయ్! నాకున్న పురుష లక్షణాలకి ఇంకొకటి జత కలిసింది. నేను ఎల్లుండినుండి నిరు ఉద్యోగిని కాబోతున్నాను. కాకపోతే వచ్చిన చిక్కేమిటంటే ప్రస్తుతం దేవిగారి సన్నిధిలో కొలువు వొదిలిపెట్టి, అయ్యవారు హైదరాబాద్ ప్రయాణం కట్టాలి!'' అన్నాడు.

ఇంక నేను కన్నీరు ఆపుకునే ప్రయత్నం చేయలేదు. ''ఎంత శుభవార్త చెప్పావు కార్తీక్! చాలా, చాలా సంతోషం. నేను ఇంక ఏ సాయంత్రమూ బీచ్ ఒడ్డుకి రావలసిన పని లేదు, ఒకరి కోసం నిరీక్షించవలసిన పనిలేదు'' గబగబా నడిచిన నన్ను ఒక్క ఉదుటున వచ్చి పట్టుకుని,

''శైలా, నాకు మాత్రం నిన్నొదిలి దూరం పోవాలని ఉబలాటంగా ఉందనుకున్నావా? నువ్వు, నన్ను ఎంత ప్రేమిస్తున్నావో నిన్నూ నేను అంతే ప్రేమిస్తున్నాను. నువ్వు నా పరిధివి శైలా! నిన్ను దాటి నా ఊహలుగానీ, కలలుగానీ ముందుకు పోలేవే, అలాంటిది నిన్ను వదిలి ఉండాలను కుంటున్నానంటే దానికి కారణం నువ్వర్థం చేసుకోలేవా? చెప్పు?'' అన్నాడు.

ఏం చెప్పను? తనతోపాటు నా ఊపిరిని కూడా తీసికెళ్తున్నాడని చెప్పనా? తను లేకపోతే నేను నడిచే శవాన్నని చెప్పనా? అసలెందుకు రావాలి ఇలాంటి రోజు. నా కార్తీక్‌ని వదలి ఉండాల్సొస్తుందన్న ఊహే తట్టుని నా మనసుకి ఇది ఎంతటి ఘాతమో ఎలా చెప్పను? ఎలా నడిచానో, ఎలా కూర్చున్నానో నాకే తెలియదు.

''ఎంత ఎంత ఎడమైతే అంత తీపికలయిక'' అని ఎవరో కవి అన్నట్టు గుర్తు. ఆయన ఏ ముహూర్తంలో అన్నాడోగానీ అది మన విషయంలో ఖచ్చితంగా నిజమవుతుంది. నీకు మరీ చేరువయ్యే ప్రయత్నంలోనే ఈ టెంపరరీ ఎడబాటు. అన్నట్టు నీకు చేరువంటే ఏమిటో తెలియదు కదూ?...'' అంటూ నన్ను గట్టిగా గుండెలకు హత్తుకున్నాడు. ''ఇది శాశ్వతం కావాలంటే శాశ్వతమైన బంధం ముడిపడాలి. అది ముడిపడాలంటే ఈ కాస్త ఎడబాటుని మనం ఓదార్చుకోవాలి. మనసుతో చూస్తే మండు టెండలోనూ చంద్రుని కళలు చూడవచ్చు. అలాగే మనం దూరదూరంగా ఉన్నా మన ప్రేమని మన మనసులలోనే పండించు కోవచ్చు. నిన్ను యుగయుగాలకు మరచిపోనని చెప్పను కానీ, అది ఈ జీవితకాలంలో మాత్రం జరగదు...'' ఏదో గుసగుసగా చెప్తూనే ఉన్నాడు. అతని గుండెలమీద తల ఆనించి ఉన్న నాకు, ఉద్వేగంతో కొట్టుకుంటున్న అతని గుండె చప్పుడు తప్ప ఏమీ వినిపించటంలేదు

''కార్తీక్! ప్లీజ్ కార్తీక్, ఏదో ఊరెళ్ళి ఉద్యోగం చెయ్యవలసిన అవసరంలేదు. ఐ విల్ వెయిట్ ఫర్ యూ! ఈ ఊర్లోనే ఉద్యోగం వచ్చేంత వరకూ ఎన్ని వసంతాలు వచ్చి వెళ్ళి పోయినా సరే ఈ గుండెకోత కన్నా, ఆ నిరీక్షణ లోనే ఎంతో హాయి ఉంది వెళ్ళకు కార్తీక్!'' అతన్ని చుట్టి ఉన్న నా చేతుల్ని బిగిస్తూ విలవిల్లాడి పోయాను.

# శిశిర జీవితాలు

కార్తీక్ ఎన్ని ఓదార్పు మాటలు చెప్పినా నా మనసు కుదుటపడలేదు. చివరకు వారానికి ఏడు ఉత్తరాలన్నా రాస్తానన్న అతని మాటను గుండెల్లో పదిల పరుచుకుంటూ, అదే మా చివరి కలయిక కాకూడదని దేవుణ్ణి మనసారా కోరుకున్నాను. కానీ దేముడు నా మొర వినలేదు.

* * *

అన్నమాట ప్రకారం కాకుండా, వారానికి ఎనిమిది ఉత్తరాలన్నా రాస్తున్న కార్తీక్ ఎన్నటికీ నా వాడే అన్న ఊహలోనే అతని ఉనికిని చవి చూస్తోంది మనసు ఎదురుగా నిలబడి నాతో మాట్లాడుతున్నాడా అనిపించే అతని ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివినా, అతన్నే నింపుకున్న నా కళ్ళకి గానీ, అతనికే అర్పించిన నా హృదయానికి గానీ అలసటనే అనిపించేది కాదు. 'కార్తీక్' అన్న అతని పేరు ఉచ్చరణకే నా పెదవుల్ని ఆ దేముడు సృష్టించాడేమో అనిపించేది. ఏ కోణం నుండి చూసినా అతని మీదున్న ప్రేమని తప్ప మరేది పాలించలేకపోయేది నా జీవితం.

త్వరలో

**రాగలహరి**

సీరియల్

అలాంటి నా జీవితంలో ఎన్నో ఆటలు ఆడి, ఎన్నో మలుపులు తిప్పి నాలో ఉన్న నిజమైన వ్యక్తిని, ఇప్పటి మనసులేని మనిషిగా, కేవలం మరబొమ్మగా మార్చాడు ఆ భగవంతుడు. ఇలా జరుగుతుందని ఊహామాత్రంగా అనిపించినా ఆనాడు కార్తీక్‌ని ప్రాణం పోయినా వెళ్ళనిచ్చేదాన్ని కాదు.

తన ప్రేమనంతా అక్షరాల రూపంతో, తన హృదయాన్నే కాగితాల్లో నింపుతూ, కార్తీక్ రాసే ఉత్తరాలు హఠాత్తుగా రావటం మానేశాయి. జీవితంలో ఏర్పడే అగాధాల్ని ఇంకా చవిచూడని మనసు కీడుని శంకించలేదు. కృష్ణుని మురళి మూగబోవటం, చంద్రుని వెన్నెలలు నిప్పులు కురిపించటం, నా కార్తీక్ నన్ను మరచిపోవటం కలలో కూడా జరగని విషయాలుగా చిత్రించు కున్నాను. ఒకవేళ నన్ను మరచిపోయాడేమో అన్న ఆలోచన మాత్రం నన్ను కత్తిలా కోసేది. ఆ బాధ నంతా నింపి, ఈసారన్నా జవాబు రాకపోదు అన్న ఆశతో నేను రాసిన ఉత్తరాలకి అతన్నుండి బదులే లేదు.

ప్రేమ, పగ అక్కాచెల్లెళ్ళలాంటివి. అందుకే ప్రేమ పండించిన నా గుండె, పగకి కక్షకి కూడా జన్మనిచ్చింది. కార్తీక్‌తో రెండేళ్ళ సహవాసంలో నేనతనిమీద పెంచుకున్న మమతానురాగాలు కూడా అంతకంతకూ పెరిగిపోతున్న అనుమానపు ఛాయలలో కొట్టుకుపోయాయి.

వేసవిలో కురిసిన ప్రతి వర్షపు చినుకు భూమిలోపల దాక్కున్న వేడిసెగలను బయటకు లాగుతుంది. అలాగే, అతని ప్రతి ప్రేమపలుకు తలుచుకున్నకొద్దీ రగులుతున్న నా కోపానికి ఆజ్యంపోసింది. ఎంత వంచన? గుండెలకు హత్తుకోవటమేగానీ గుండెల్లో దాచుకోలేనివాణ్ణి నేను నా మనసులో దేవతామూర్తిలా ప్రతిష్ఠించి గుడ్డిగా ఆరాధించింది? మోసంలో నలిగిపోయిన తరువాతగానీ మగవాడి అంతర్యాన్ని గుర్తించలేని ఆడదానిగా పుట్టానని, అలా పుట్టించిన ఆ దేముణ్ణి బేలగా ఎన్ని శపించానో నాకే తెలియదు. గుండె మడతలలో దాచుకున్న నా గతంలోకి చూస్తున్న నాకు, నేను ఆఖరి ప్రయత్నంగా అతనికి రాసిన ఉత్తరం, గుండె ప్రతి నరంలో నుండి పొంగిన ఆ అక్షర పంక్తులు ఈ నాటికీ నా కళ్ళలో మెదులుతున్నాయి.

''ఇన్నాళ్ళు నా గుండెల్లో ఉండి, ఈనాడు దాన్ని చీల్చుకుని బయటకు వెళ్ళిపోయిన నిన్ను సంబోధించటానికి మనిద్దరి మధ్యన సరి అయిన వరుసలేదు. నిన్ను మనసు లోతుల్లో నుండి పిలిచే నాకు, ఈనాడు ఆ మనసనే పదార్థంలేదు. ఆ స్థానంలో కరుడు కట్టిన కన్నీళ్ళు, సమాధి చేసుకున్న జ్ఞాపకాలు మాత్రమే ఉన్నాయి. నిన్ను ఎంతగానో ఆరాధించిన నేను, ఇప్పుడు నీ ఊసెత్త టానికే భయపడుతున్నాను. ఎందుకో తెలుసా, ఎంతటి మోడువారిన వృక్షమైన ఆమని రాకతో చిగురిస్తుంది. నాలో కూడా నీ ఊహలు, నిన్ను గురించి నేను కన్న కలలు, బీటలువారిన నా గుండెల్లో మళ్ళీ ప్రేమ మొలకల్ని నాటుతాయేమో నని. నీకెంతటి విలువ నాపాదించానో చూసావా కార్తీక్! నేను నిన్ను సంజాయిషీ అడగటంలేదు. కానీ నన్ను నిర్లక్ష్యం చెయ్యటంలోనే ఆనందాన్ని చవి చూసే నీ మనసు ఒకప్పుడు నాకే ఇచ్చానని చెప్పావు. అదే మాట ఈనాడు ఇంకొకరికి వల్లె వేస్తున్నావని నా అంచనా. నా ఈ అంచనా ఎన్నటికీ తప్పుకాదని ప్రగాఢంగా విశ్వసిస్తూ, నన్ను కోరి వివాహమాడాలనుకుంటున్న ప్రొఫెసర్ శ్రీరామ్‌ని మనస్ఫూర్తిగా నా జీవితంలోకి ఆహ్వానిస్తున్నాను. పంధొమ్మిది వసంతాలు నాకు సమకూర్చిన అందాల్ని నీకే అర్పించుకోవాలను కున్నాను. కానీ అది జరగనందుకు చాలా సంతోష పడుతున్నాను. కసాయివాణ్ణి నమ్మిన మేకపిల్ల తనవంతు వచ్చేవరకూ బాగానే ఉంటుంది. కానీ పులితో స్నేహం చేద్దామనుకున్న రోజు ఏమవు తుంది? సమాధానం నీ ఒక్కడికే బాగా తెలుసు. అయినా ఇంత ఉత్తరం రాసే ఓపిక నాకు, చదవగల తీరిక నీకు ఇప్పుడు లేవు. మనిద్దరి బాటలు వేరు, అందుకే గమ్యాలు కూడా వేరే. దీనితోపాటు నా శుభలేఖని జతపరుస్తున్నాను. నా ఆహ్వానం నీ ఆశీర్వచనానికి విలువనిచ్చి కాదు, నువ్వు జారవిడిచిన నీ స్థానాన్ని మరే పురుషుడు భర్తీ చెయ్యలేడన్న నీ ధీమాని సవాల్ చేస్తూ—

శలవ్!

నీకు ఏమీకాని

శైలజ.''

ఆ ఉత్తరాన్ని రాయటానికి కన్నీళ్ళు ఇగిరిపోయిన నా కళ్ళకి ఎన్ని కన్నీళ్ళు కావలసి వచ్చాయో, కుంచించుకుపోయిన నా గుండెకి ఎంత

# శిశిర జీవితాలు

నిబ్బరం కావల్సివచ్చిందో ఈ క్షణానికి నాకు గుర్తొంది. ఉత్తరం అందుకోగానే కార్తీక్ రెక్కలు కట్టుకు వాల్తాడన్న నా ఆశ, ఆశగానే మిగిలిపోయింది. నేను పెళ్ళికూతురుగా ఇంకొకరి జీవితంలోకి అడుగుపెట్టవలసిన ఘడియ ఏ ఆటంకమూ లేకుండా గడిచిపోయింది. ఆ ఘడియే నాలో నాటుకుపోయిన ప్రేమలతని కూకటివేళ్ళతో సహా పెకిలించేసింది. ఆనాడు కార్తీక్‌ని దేముడుగా నమ్ముకుని ప్రేమించాను. ఈనాడు నాకు పసుపుతాడు కట్టిన మనిషిని భర్తగా స్వీకరించి పూజిస్తాను అన్న నిస్సంకోచమైన భావనలోనే సంసార జీవితంలోని మొదటి ఆరు నెలలూ గడచిపోయాయి. ఆ తరువాతే నన్ను కలిచివేసిన రోజు వచ్చింది. మనిషి అంచనాలకూ, ఊహలకు, అసలు వాస్తవానికి మధ్య ఉన్న దూరాన్ని నాకు తరచి చూపించిన ఆ రోజు ఈనాటి నా మనోస్థితికి పునాది.

*　　　*　　　*

నాలో నిక్షిప్తమై ఉన్న అహంతో, చాలా సహజమైన కుతూహలంతో ఏడాది క్రితం నా ప్రియుడుగా పరిచయం ఉన్న వ్యక్తిని, ఈనాటి నా క్రొత్త జీవితంలో కేవలం ఒక పాతవ్యక్తిగా మాత్రమే గుర్తున్న వ్యక్తిని కలిసి ఏదో థ్రిల్ని పొందాలన్న ఆశతోనే, పెళ్ళికని హైద్రాబాద్ వెళ్ళిన నేను, నా ప్రేమలేఖల్ని ఎన్నిటినో అందుకున్న అతని ఎడ్రస్‌ని వెతుక్కుంటూ వెళ్ళాను. ఈ హఠాత్సంఘటన అతని వయవంచనకు మళ్ళీ ఎటువంటి అవకాశాన్ని కల్పిస్తుందో అనుకుంటూ, అలాంటి దానికి దేనికి తలవంచని ధైర్యంతో అతని రూమ్‌లోకి అడుగుపెట్టాను. నాకెంతో చిరపరిచయమైన అతని ఉనికి అక్కడ అణువణువులోనూ ఉంది. 'ఎలాంటి పరిస్థితులలో అతని ఇంటిలోకి అడుగుపెట్టాలనుకున్నాను. ఏ పర్థితితో అర్థంకాని అగమ్యగోచరమైన స్థితిలో అడుగుపెట్టాను' అనుకుంటూ నిలబడ్డాను చుట్టూ పరికిస్తూ.

"ప్లీజ్ అలా కూర్చోండి!" అన్న మగ గొంతుక విని అటు తిరిగాను. అతను సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. కళ్ళు నన్ను చాలా నిశితంగా పరికిస్తున్నాయి. తటపటాయిస్తున్న నన్ను,

"ఫర్వాలేదు, అలా కూర్చోండి శైలజగారు!" అన్నాడు. ఉలిక్కిపడ్డాను నేను. ఎంతో సుపరిచితుడులా ఉన్న అతని ప్రవర్తన నన్ను అయోమయంలో పడేసింది.

"మా ఊరెప్పుడొచ్చారు ?" కూజాలోంచి నీళ్ళు గ్లాసులోకి వంపుతూ ప్రశ్నించాడు. నా సమాధానం వినాల్సిన అవసరం లేనట్టు అతను ప్రశ్నల పరంపర కురిపిస్తూనే ఉన్నాడు.

"శ్రీరామ్‌గారు కులాసానా ?" అన్న అతని ప్రశ్నకి అదిరిపడ్డాను. అతనందించిన గ్లాసెడు నీళ్ళు గబగబా తాగేశాను. నా గురించిన ప్రతి విషయం క్షుణ్ణంగా తెలుసుకున్న ఇతను కార్తీక్ అంతరంగానికి ఎంత చేరువో అర్థమయ్యింది నాకు. 'అయినా ప్రేమించిన స్త్రీని మోసగించానని అంత బాహాటంగా ఈ వ్యక్తికి చెప్పటానికి కార్తీక్‌కి అసలు సిగ్గులేదు' ఎంతో ఏహ్యతగా అనుకున్నాను.

"మీ కార్తీక్‌ని చూద్దామని వచ్చారా ?" ఎంతో వ్యంగ్యంగా ప్రశ్నించాడు. చివుక్కున తలెత్తి చూసాను. ప్రశ్నలో నిండిన వ్యంగ్యం, వెక్కిరింత మొహంలో కూడా కనపడుతున్నాయి. ప్రేమలో తిరస్కరింపబడిన నేను 'అహాన్ని' నాలో జీర్ణించేసుకున్నాను. అందుకే,

"నాకు తెలియని మనుషుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వటం నాకు అలవాటులేదు!" కటువుగా అన్నాను.

"ఓహో! నన్ను నేను పరిచయం చేసుకోవాలి గదూ ? అయితే వినండి ప్రేమ మనసులో గంతులువేస్తూ, కళ్ళలో ప్రేయసి కలలే సాక్షాత్కరిస్తూ, పరమపదసోపానంలో పైమెట్టు నెక్కించే నిచ్చెనల్ని తప్ప, అగాధాలకు త్రోసివేసే పాము నోట్లో పడని పావువంటి ఒకనాటి కార్తీక్ జీవితానికి మీరు ఎలా అవసరమయ్యారో, ఈనాటి అతని ఒంటరి జీవితాన్ని, మనుగడ కోసం మరో మనిషిమీద ఆధారపడవలసిన అతని దుస్థితిని, తన చుట్టూ ఉన్న వెలుగుని తమలో మాత్రం వెలిగించుకోలేని అతని కటోది కళ్ళను, విధి అనబడే ఇనుపహస్తాలలో నలిగిపోకుండా అతని గుండెని, ఈ అరచేతుల్లో పెట్టుకుని కాపాడుకుంటున్న నేను అతనికి, అతని జీవితానికి ఆసరాను! ఇప్పుడు చెప్తారా సమాధానం ?"

ఉండేలు దెబ్బతిన్న పావురాయిలాగా గిలగిల్లాడిపోయింది మనసు. మొద్దుబారిపోయింది మెదడు. చూస్తున్నదేమిటో అర్థం చేసుకునే శక్తి కళ్ళకు గానీ, వింటున్నదేమిటో అర్థం చేసుకునే శక్తి నాకూ లేకుండాపోయింది. "నీ కఠినత్వం ఎంత చేదుగా ఉంటుందో చూపేందుకేనా నన్ను ఇంకా మిగిల్చే ఉంచావు భగవంతుడా? నన్ను ఎడారిలో వదిలేశాడని కార్తీక్‌ని శపించాను, కానీ అతని జీవితాన్ని ఎడారి చెయ్యమని నిన్ను వరం అడిగానా? ఆరనిమంటలాంటి నా జీవితంలో చల్లని మంచుని కురిపించాల్సిన నువ్వు, చితిమంటల్ని పేరుస్తావా ? ఇన్నాళ్ళూ నాకు జరిగిన కష్టానికే ఏడ్చాను, ఇకనుండి విధి దోపిడీలో సర్వం కోల్పోయిన కార్తీక్ కోసం కూడా ఏడుస్తాను, క్షణక్షణం ఏడుస్తాను..." కన్నీటిధారలు నా గుండెల్ని తడిపేశాయి.

"ఇలా జరుగుతుందని, జరిగిందని తెలియని నాకు అతనిమీద ద్వేషం పెరగటం సహజం. అయినా నా జీవితాన్ని తెరలోంచి మాత్రమే చూస్తున్నాను. ఇన్ని ఆకస్మిక సంఘటనలలో నన్ను నేనే మరచిపోతున్నాను. నేనంటే ఎవరో తెలుసుకునే లోపలే నేనంటూ అసలు మిగలను. అయిపోయింది. అంతా అయిపోయింది. రాగద్వేషాలలో వికీర్ణం పొందిన జీవితానికి ఇదే అంతం ..." కుమిలిపోయింది మనసు, కన్నీరు కారుస్తోంది హృదయం. చేతుల్లో మొహాన్ని దాచుకుని బావురుమన్నాను.

"శైలజగారు!" ఎంతో మార్దవంగా, ఆర్ద్రంగా పిలిచాడతను "మీది ఎంత మన్నిత హృదయమో కార్తీక్ మీ గురించి చెప్పిన దాన్ని బట్టి ఊహించగలను. అయినా పరిస్థితులకు మన మందరమూ బానిసలమే! అందుకే అంత కఠినంగా మాట్లాడాను. క్షమించండి!" మనఃపూర్తిగా అన్నాడు. మౌనంగా ఉండిపోయాను.

జీవం, జవంలేని నా మనసులోని భాషని అర్థం చేసుకుంటూ అతని వాక్ప్రవాహం సాగిపోతోంది. కాంతి కిరణాల్ని ప్రసరించే కార్తీక్ కళ్ళు ఏ కారణం వల్ల చీకటి నిలయాలుగా మారిపోయాయో అతను వివరిస్తుంటే, ఒకనాడు ఆ కళ్ళలో నా ప్రతిబింబాన్ని చూసుకుంటూ మురిసిపోయిన నేను, జీవన లావణ్యంలో చీకటిలుగా చీలిన మనసుతో కుమిలిపోయాను.

విధి ప్రజ్వలింపచేసే కాష్ఠంలో బ్రతికుంటే దహన సంస్కారాలు పొందే జీవితాల వెనక ఉండే కథలను ఒక మనిషి మరో మనిషికి ఎప్పుడూ చెప్తూనే ఉండాలి. అందుకే కార్తీక్ పనిచేసే కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదంలో అతను ఎలా చిక్కుకుపోయింది అన్న విషయాన్ని మరో మనిషి నోటి వెంబడి విన్నాను. కార్తీక్‌ని ఎంతో ఇష్టపడే ఈయన మీద ఏదో గౌరవభావం కలిగింది.

"ద్వేషంతో నా మనసు చిందించిన అగ్నిజ్వాలలు ప్రేమ చెక్కిన అపూర్వ దృశ్యాలకు మసి పూసేశాయి. ఇప్పుడు కార్తీక్‌ని నా గుండెల్లో దాచుకుందామన్నా ఆ అర్హతలేని దాన్ని! ఏ త్యాగమూర్తి విషబిందువుల్ని చిందించే గుండెలో ఉండలేదు. అందుకే నా గుండెని ఖాళీ చేసేశాడు కార్తీక్! అతనెలాంటి పరిస్థితిలో అలా చేశాడో కనుక్కోవాలన్నది కూడా తెలియని అజ్ఞానం నాది. పోనీ అతడన్నా నన్ను పరాయిదానిలాగా చూడక, తన మనిషి ననుకుంటే ఈనాడు నాకీ బాధ ఉండేది కాదు. చూడలేని అతని కళ్ళకు చూపు నివ్వలేకపోయినా, కలిసి గడుపుదామనుకున్న జీవితాన్ని కలిసే గడిపేవాళ్ళం. నేనేం తప్పు చేసానని, కనీసం నాకు తెలియజేయాలన్న ఊహే తట్టలేదు కార్తీక్‌కు ?" వెక్కిళ్ళ మధ్య ప్రశ్నించాను.

"తన నావ చిల్లు పడిందని తెలుసుకుని, దానికి తోటి ప్రయాణీకుడు బలి అవుతాడేమోనని జడిసి, ఒంటరిగా యానం సాగించే నావికుడు కార్తీక్! అతడు చేసిన పనిలో మీ మీద ఎంత ప్రేమ దాగుందో నాకు తెలుసు. మీరతనికి రాసిన చివరి ఉత్తరం చదివి వినిపిస్తుంటే, ఒకొక్క మాటా నాకే శూలంలా తగిలితే, అతను మాత్రం "నను అంతగా ప్రేమించే మనిషి కనుకనే అలా రాసింది. తన సుఖాన్ని తప్పవేరే ఏదీ నేను కాంక్షించనని తనకి తెలియదు. పిచ్చి శైల!" అంటూ కంట తడిపెట్టాడు. అలాంటి వాడు నా స్నేహితుడని చెప్పటానికి చాలా గర్వపడతాను శైలజగారు!' అన్నాడతను.

ఆ గర్వం ఇదివరకు నాకు సొంతం. కానీ ఇప్పుడు ? విరక్తిగా నవ్వుకున్నాను. నా భావాల తీవ్రతను అతను గమనిస్తున్నాడు. జీవ చైతన్యానికి, భావ చైతన్యానికి నేను చాలా

# శిశిర జీవితాలు

దూరంలో ఉన్నట్టు గ్రహించిన అతను మామూలు సంభాషణను ప్రస్తావించాడు

"నా పేరు ప్రభాకర్! కార్తీక్ టీచర్‌గా పనిచేస్తున్న బ్లైండ్ స్కూల్ ప్రక్కనే ఉన్న కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నాను. ప్రతిరోజూ కలిసివెళ్ళి కలిసే వస్తాము. కానీ ఈ రోజు వంట్లో బావుండక నేను వెళ్ళలేదు. బహుశా మీ రాకని నా మనసు ముందే గ్రహించిందేమో!"

'ఏమిటీ విధి లీల! ప్రేమించిన మనిషికి, ప్రేమించినవాడిగా ఎంతో చేరువవుదామనుకున్న మనిషి, గుడ్డివాడై, గుడ్డివాళ్ళ మధ్య నిలబడి వాళ్ళకు చేయూతనందిస్తున్న ఈ మనిషికి ఎంత వ్యత్యాసం? ఇప్పటి నిస్వార్థ జీవితంలోనన్నా ఇతను సంపూర్ణానందాన్ని పొందాలి భగవంతుడా! శాపగ్రస్త జీవితాన్ని నువ్వు కూడా చులకనగా చూడకు స్వామీ—' అన్న నా ఘోష ఈసారి నా దేముడు విన్నాడు.

"మీలో ఇది ఎలాంటి భావాన్ని కలిగిస్తుందో తెలియదు. కానీ, కార్తీక్ త్వరలో పెళ్ళికొడుకు కాబోతున్నాడు. ఒక క్షణం..." మెల్లగా లేచి వెళ్ళి చేతిలో ఒక ఫోటోతో తిరిగొచ్చాడు. అందులో ఉన్న అమ్మాయి సామాన్యంగా ఉన్నా, పెదవుల మీది చిరునవ్వు కళ్ళలో కూడా వెలుగుతూ చాలా ఆకర్షణీయంగా ఉంది. ఫోటో తిరిగి ఇస్తూ అతని కళ్ళలోకి చూసాను. అనిర్వచనీయమైన ఆనందం కనపడుతోంది. దేముడు వేరే లేడు, సాటి మనిషి ఆనందంలోనే తనూ ఆనందాన్ని చవిచూసే ఇతనిలోనే ఉన్నాడు అనిపించింది. అదే మాట అన్నాను, కృతజ్ఞతాపూర్వకంగా.

"ఇందులో నా స్వార్థచింతన కూడా ఉంది శైలజగారు! ఆమె నా చెల్లెలు మానస. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉంది. చిన్నతనంలోనే పోలియో వచ్చి ఒక కాలు కుంటుపడిపోయింది. వారం రోజుల క్రితమే ఆపరేషన్ జరిగింది. కానీ దురదృష్టం దాన్ని వెంటాడుతూనే ఉంది. ఆపరేషన్ ఫేలయ్యింది. పరిగెత్తకపోయినా కనీసం అందరిలాగా నడవాలన్న దాని ఆశ ఆవిరైపోయింది. ఇక మళ్ళీ ఆ కర్ర ఆసరా, ఈ అన్నయ్య చేయూత తప్పలేదు దానికి—" బాధగా నిట్టూర్చాడు.

మౌనంగా వింటున్న నాకు — "కార్తీక్ అవసరాల్ని తీర్చగలిగినవి తీరుస్తున్నాను. కానీ స్త్రీ అందించగల ప్రేమానురాగాలు అందించలేనివాణ్ణి. అందుకే నా రెండు కళ్ళుగా చూసుకుంటున్న ఇద్దరినీ ఒకే బాటమీద నడపాలని నా ఊహ. మనిషికి తనలాగా ఏదో లోపం ఉన్న మరో మనిషి మీద సానుభూతి, జాలి. వాటినుండి వారిద్దరి మధ్యన చిక్కటి బంధం ఉత్పన్నమవ్వాలని నా నిరీక్షణ..."

"మీ నిరీక్షణ తప్పక ఫలిస్తుంది ప్రభాకర్ గారు. మంచి జరపాలనుకుంటున్న మిమ్మల్ని ఏ శక్తీ ఆపలేదు. నాలాంటి మూర్ఖురాలితోకన్నా, అంగవైకల్యం ఉన్నా, నెత్తుటిలో మంచితనం ప్రవహించే మీవంటివారి చెల్లెలితో కార్తీక్ దాంపత్య జీవితం పరిమళిస్తుంది. వారిద్దరికి భవిష్యత్తు బంగారు బాట కావాలని కోరుకుంటున్నాను" నిర్మలమైన మనసుతో చాలా స్వచ్ఛంగా అన్నాను.

"అలా మనస్ఫూర్తిగా ఆశీర్వదించండి శైలజగారూ! ఎంతో ఆశీర్వచనబలం, మానసిక బలం లేనిదే ఇద్దరు శారీరకంగా అసహాయులైన వారు కలిసి జీవితాన్ని వెళ్ళబుచ్చలేరు!"

"ఒక ప్రేమమూర్తి వారిరువురి చేతుల్ని పట్టుకు నడిపిస్తే జీవనయానం అంత కష్టమైనదిగా తోచదు వాళ్ళకు. అది మీరు అందించగలరన్న సంపూర్ణ విశ్వాసం నాకుంది!" అన్నాను ఇంతకాలం కార్తీక్ జీవితానికి చుక్కానిగా నిలచిన ప్రభాకర్‌ని చూస్తూ.

గడియారం మూడు గంటలు కొట్టింది "కార్తీక్ వచ్చే వేళయ్యింది" అన్నాడు గడియారాన్ని చూస్తూ. గబుక్కున లేచి నిలబడ్డాను. "నేనిక వెళ్తానండి!" అన్నాను. "అదేం? కార్తీక్ వచ్చేవరకూ ఆగరా?" సమాధానం తెలిసి అడిగిన భావగర్భితమైన ప్రశ్న.

"లేదు ప్రభాకర్! అతన్ని కలిసే ధైర్యం నాకు లేదు. అతనికి ఎదురుగా నిలబడినా నన్ను గుర్తించలేని కళ్ళలోకి చూడలేను, చూసి భరించలేను" కన్నీళ్ళు జలజలా కారాయి. "ఒక ప్రేమ దేముని ముందు దోషిగా నిలబడలేను!" నా పరిస్థితిని అర్థం చేసుకున్న అతన్నుండి శలవ పుచ్చుకుని, నా ఈ రాకని కార్తీక్‌కు తెలియనివ్వనని అతన్నుండి మాట తీసుకుని, వాళ్ళ ముగ్గురి చుట్టే పరిభ్రమిస్తున్న మనసుతో వాళ్ళకి శుభం జరగాలని వేయి దేవుళ్లకు మొక్కుకున్నాను. ఆ నాటి నుండి ప్రతిరోజూ అదే చేస్తున్నాను.

—"ఆ రోజు నుండి గుడ్డివాణ్ణి చూస్తే, తడుముకుంటూ నడిచే కార్తీక్ కనిపిస్తాడు. అనుకోకుండానే నా కళ్ళు వర్షిస్తాయి. ఈనాడు ఆయన అంత సూటిగా ప్రశ్నిస్తారనుకోలేదు. అయినా నా సమాధానం మాత్రం విని ఆయన మనసు సమాధాన పడదు, సోధించి సాధించాలనుకుని చిత్రవధ చేస్తుంది. అది నేనింక భరించలేను. మట్టిని తడపందే బొమ్మగా మార్చలేము. మట్టిగడ్డగా మారిన నా మనసు, ఆయన ప్రేమాను రాగాలలో తడిసి ఇప్పుడే మళ్ళీ రూపు దిద్దుకుంటోంది. మూర్ఖంగా ఆయన్ని జార విడుచుకోలేను. నా గతం నాలోనే సమాధి కావాలి," ఇలా అనుకుంటున్న నేను రైలు పెట్టిన పిశాచి కేకకి ఈ లోకంలో పడ్డాను.

అప్పటికే ఆయన లేచి, సూట్‌కేసులు సర్ది, తలుపు దగ్గరగా నిలబడి చూస్తున్నారు. ఆయన విముఖతని గుర్తించనట్టే ఉండిపోయాను.

* * *

ఆటోలోంచి దిగిన నేను "అసలు పెళ్ళి హడావిడే లేదేమండి?" ఆశ్చర్యంగా ప్రశ్నించాను.

"పెద్ద ఆర్భాటం ఏమీలేదు. దండలు మార్చుకోవటమే. తరువాత చిన్న పార్టీ, అంతే!" ముందుగా నడుస్తూ ఆయన సమాధానం.

పెళ్ళికూతురు ముస్తాబులో ఉన్న అమ్మాయిని ఎక్కడో చూసినట్టుంది. రెండవసారి చూసే అవకాశం లేకుండా ఆయన గబగబా లోపలికెళ్తున్నారు. పెళ్ళి ఎవరిదో కూడా తెలియకుండా, ఆయన రమ్మంటే వచ్చిన నాకు అంతా అయోమయంగా ఉంది. ఆయన, పెళ్ళికొడుకు ఏ గదిలో ఉన్నాడో అడిగి తెలుసుకుని ఆ గదిలోకెళ్ళారు. నేనూ, ఆయన వెనకాలే గదిలో కడుగు పెట్టాను. అతను కిటికీ దగ్గరున్న కుర్చీలో కూర్చున్నాడు. ఆయన మెల్లగా వెళ్ళి అతని భుజం మీద చెయ్యివేసి "కార్తీక్!" అన్నారు.

"వచ్చావా రావ్!" ప్రేమగా అంటూ లేచి నిలబడ్డాడు. నా కాళ్ళక్రింద భూమి కదిలినట్టయ్యింది. గోడమీద చేతులానించి నిలదొక్కుకున్నాను.

"శైలజని కూడా తీసుకొచ్చాను కార్తీక్!" అంటున్నారాయన. "శైలా..." గుండెనంతా గొంతుకలో నింపి పిలిచాడు కార్తీక్. మెల్లగా వెళ్ళి ఎదురుగా నిలబడ్డాను. తడుముకుంటూ నా తలమీద చెయ్యివేసి ఆప్యాయంగా నిమురుతూ ఉండిపోయాడు. జన్మలో ఐక్యం కావాలని ఉవ్విళ్లూరే తన ప్రేయసి నదితో శుభ సరసాలాడే శృంగార సాగరుడు, తన ప్రేయసికి శుభం జరగాలని దీవిస్తున్న గంభీరసాగరుడు, ఇద్దరూ ఒకరి తరువాత ఒకరు కార్తీక్ హృదయాంతరాళలో నుండి పొంగినవారే! అతని స్పర్శలో దైవత్వాన్ని చవి చూస్తోంది మనసు. అతని కళ్ళు నన్ను చూడలేకపోయినా, నాలోకి దూసుకుపోయి నా హృదయాన్ని చూస్తున్నాయి. ప్రేమ సందేశాల్ని, కాక కుశల సందేశాల్ని పంపిస్తున్నాయి.

"శైలజ తల్లి కాబోతోంది కార్తీక్?" చనువుగా చెప్పారాయన. "నాకు తెలుసు రావ్, నువ్వెంతటి ప్రేమానురాగాలనందించగలవో. అందుకే నా హృదయ వనంలో విరిసిన గులాబీని ప్రాణప్రదంగా చూసుకునే మాలి చేతుల్లో పెట్టాను. దాన్ని ఎన్నటికీ వసివాడనీయకు రావ్!" ప్రేమగా అజ్ఞాపిస్తున్నాడు.

తాను కన్న కలలన్నీ శూన్యంలోకి ఆవిరైపోతే, వాటిని నా జీవితంలో పండించిన కార్తీక్‌కు కృతజ్ఞతా కుసుమాలతో పూజ చేసింది మనసు. నా గురించి, నా గతం గురించి ప్రతిదీ తెలిసి నన్ను వివాహం చేసుకుని, అబద్ధం చెప్పిన అల్పురాల్ని కూడా తన గుండెల్లో దాచుకున్న ఆయనమీద నా అణువణువు కృతజ్ఞతతో నిండిపోయింది.

మా ముగ్గుర్నీ దూరాన్నుండే చూస్తున్న ప్రభాకర్‌ని చూస్తుంటే మూర్తీభవించిన ఆ మంచితనానికి, ఉన్నతత్వానికి ఎన్నటికన్నా చేరువకాగలనా అనిపించింది. ఆ నా భావాన్ని నా కళ్ళలో చదివినట్టు మెల్లగా అతని పెదవుల మీద చిరునవ్వు! శిశిరంలో సర్వం కోల్పోయినా ఆమని రాకతో కళకళలాడే జీవితాలు 'మావి' అనిపించింది ఆ క్షణం! కార్తీక్, మానసలు దండలు మార్చుకుంటుంటే "శిశిరం వెళ్ళిపోయింది!" అన్నాను ఆయనతో!